# మొగసాల నెక్కిన మగువ

బయట పండు వెన్నెల పిండారబోసినట్లుంది. ఆరు బయట అమ్మతో పాటు మంచం మీద పడుకున్న పాపాయి మెల్లిగా లేచి అడిగింది - 'అమ్మా కథ చెప్పవూ ?' అని

'ఏం కథమ్మా, మన బ్రతుకులే ఒక కథ కదూ !' అని అందరూ అన్నట్టే అనేసింది వాళ్లమ్మ. ఆ మాదిరి సమాధానంతో ఏ పాపాయీ వూరుకోదు : యీ పాపాయీ వూరుకోలేదు !

''ఫో నీలేవే ఎప్పుడూ ఇలాగే అంటావు ఒక్కటంటే ఒక్క కథ చెప్పమంటేను !''

'అబ్బ ! ఏ కథా జ్ఞాపకం లేదే! '

'ఫో అమ్మా ! నేను ఎప్పుడు కథ చెప్పమన్నా జ్ఞాపకంలేదంటావు. మరి ప్రతిరోజూ ఆ పుస్తకాలు చదువుతావుగా అమ్మా !''

''అబ్బ చంపుతావే - అయితే విను. అనగా అనగా ఒక వూరిలో నాలాంటి ఒకావిడకి నీలాంటి ఒక కూతురు వుండేది ...''

''కథ చెప్పమంటే - 'నీలాగే' 'నాలాగే' అని అంటావు - నా 'వూసు లేకుండా కథలే లేవా ?''

''సొంతం వినవే! ... ఆ పిల్ల ఏలాటిదనుకున్నావు ! '' మహా బుద్ధిమంతురాలులే! ఎలా చెబితే అలా, అక్షరమైనా తప్పకండా నడుచుకొనేది. అంటే - 'కుక్క యింట్లోకి వస్తుందేమో చూడు !' అని చెప్పి వాళ్లమ్మ వెడితే, కుక్క లోపలికి వచ్చి ఏం చేసినా అలా చూస్తూ కూర్చుండి, అమ్మ రాగానే 'ఇలా ఇలా చేసింది అని చెప్పే రకం అన్నమాట ! ఏళ్ళు ఎగసనా, బుద్ధి దిగసనా అయింది. ఆ అమ్మాయికి వాళ్లమ్మ రోజూ చెబుతూనే వుండేది కానీ ఏం లాభం?

ఇలాంటి పిల్లతో ఎన్ని చిక్కులు పడుతున్నా, ఏలాగో ఒక లాగ సర్దుకుపోతుంది వాళ్లమ్మ. ఇలా ఉండగా ఒకనాడు వాళ్ల యింటికి ఆ పిల్ల మేనమామ వచ్చేడు. అప్పుడు ఆ అమ్మాయిని వాళ్ల అమ్మ పిలిచి, ''చూడమ్మా ! మీ మావయ్య వచ్చాడు. నంగిరి పింగిరిగా వుండక, కలివిడిగా వుండి, అతనిచేత పని చేయించగూడదు కాబట్టి, అతనికేది కావాలిసినా, నువ్వే సాయం చేస్తూండాలి, తెలిసిందా?'' అని చెప్పింది.

''కొంతసేపటికి మేనమామ స్నానానికి నీళ్లు తోడుకుంటుంటే చూచి, ఆ పిల్ల నీళ్లు తోడి యిచ్చింది. పిల్ల బుద్ధిమంతురాలని మేనమామ అనుకున్నాడు. ఆయన స్నానం సగం చేశాడో లేదో, 'నీకు సాయం చేస్తాన'ంటూ మిగిలిన నీళ్లన్నీ తాను పోసేసుకోవడం మొదలుపెట్టింది. అది చూసి

